
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 4 ఫిబ్రవరి 2025





పోటీల్లో గెలుపొందిన పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ అనురాధ

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన పోలీస్ అధికారులు, సిబ్బంది

- అభినందించిన సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జోన్ తరఫున ప్రాతినిధ్యం వహించి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది మెడల్స్ సాధించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విష్ణు ప్రసాద్, రాజేష్ లాన్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ టెన్నిస్ ఓపెన్ డబుల్స్‌లో కాంస్యం, ఆర్ఎస్ఐ రోహిత్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్, ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్ కరాటేలో గోల్డ్ మెడల్, ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మణ్ బాడీ బిల్డింగ్‌లో సిల్వర్, ఏఆర్ కానిస్టేబుళ్లు రాకేష్, శ్రీకాంత్, షేక్ బాబా, సివిల్ కానిస్టేబుల్ లింగం ఖోఖోలో కాంస్యం గెలుపొందారు. మెడల్స్ సాధించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని కమిషనర్ అనురాధ, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ అభినందించారు. విధి నిర్వహణతో పాటు రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో రాణించి మెడల్స్ సాధించిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలన్నారు.

తెలంగాణ ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మల దహనం
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు



సంగారెడ్డిలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసినందుకు ఈ ప్రాంత ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. లక్షల్లో పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కేంద్రం తెలంగాణకు మాత్రం గుండు సున్న ఇచ్చిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని దద్దమ్మలని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోస్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొంగులరవి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ఉద్యాన రైతుకు ఊతం..
సీఈవో కేంద్రం
ములుగులో ఉద్యాన పంటలపై పరిశోధనలు
మేలైన రకాల పెంపకం కేంద్రం ద్వారా
రైతులకు నారు, మొక్కల సరఫరా 7

పసి హృదయాలకు
'సంజీవని'
సత్యసాయి సేవా సంస్థల సేవలు అద్భుతం
ప్రముఖ సినీనటుడు సుమన్ 7

కొండపోచమ్మతల్లికి
నీరాజనం
యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘటం ధూం ధాం 7

సరస్వతీ నమస్తుభ్యం

- వర్గల్ విద్యాధరి క్షేత్రంలో వైభవోపేతంగా వసంత పంచమి
- భారీగా తరలివచ్చిన భక్తులు
- చిన్నారులకు అక్షర స్వీకారాలు, అమ్మవారికి లక్ష పుష్పార్చన, చండీ హోమం
- ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రత్యేక అలంకరణలో విద్యాసరస్వతీ అమ్మవారు

వర్గల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో వసంత పంచమి (శ్రీ పంచమి) మహోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో గణపతి పూజతో తెల్లవారుజామున 4 గంటలకు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చండీహోమం, శ్రీచక్ర పూజ, రాజోపచారపూజ, ఆలయ మండపంలో భక్తులతో లక్ష పుష్పార్చన, చిన్నారులకు అక్షర స్వీకారాలు ఘనంగా జరిగాయి. వసంతపంచమి సందర్భంగా ఆలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అక్షర స్వీకారాల టికెట్లు జారీ చేశారు. సుమారు 5వేల మంది చిన్నారులకు అక్షర స్వీకారాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేడుకలకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్



చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు చేయిస్తున్న వేద పండితులు

దాదాపు 50 వేల మంది వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. క్షేత్రానికి సుమారు 3 కిలోమీటర్ల వరకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసినప్పటికీ రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఏర్పడింది. గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 100 మంది పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

విద్యా సరస్వతీ అమ్మవారికి చెప్పన్‌భోగ్

వసంత పంచమి పర్వదినం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు చెప్పన్‌భోగ్ కార్యక్రమం నిర్వహించారు. 56 రకముల తీపి పదార్థాలతో అమ్మవారికి విశేష మహా నివేదన సమర్పించారు.

ప్రతీ ఒక్కరూ విద్యావంతులవ్వాలి : మంత్రి పొన్నం

వసంత పంచమి వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అమ్మవారి శేషవస్త్రాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వసంత పంచమి సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావలేనని ఆ సరస్వతీ అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కరపత్రాన్ని చూపుతున్న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధులు

8, 9 తేదీల్లో సిద్దిపేటలో జాతీయ వార్షిక సదస్సు

- తెలుగు సాహిత్యం, అంబేడ్కర్ ప్రభావమనే అంశంపై సదస్సు
- ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధులు వెల్లడి

సిద్దిపేటకల్చరల్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక రెండు తెలుగు రాష్ట్రాల రచయితలను సమీకరించి జ్ఞాన చైతన్యాల విస్తరణకు అవసరమైన అధ్యయనాలు చేస్తుందని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధులు అనిశెట్టి రజిత, కాత్యాయని విద్మహే, రామలక్ష్మి, శాంతి ప్రబోధ, షహనాజ్ బేగం తెలిపారు. అందులో భాగంగానే సిద్దిపేటలోని విపంచి ఆడిటోరియంలో ఈనెల 8, 9 తేదీల్లో జాతీయ వార్షిక సదస్సు నిర్వహిస్తున్నామని వారు సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సిద్దిపేటలోని విపంచికళా నిలయంలో నిర్వహించే జాతీయ వార్షిక సదస్సు తెలుగు సాహిత్యం అంబేడ్కర్ ప్రభావం అనే అంశం మీద జరుగుతుందన్నారు. ఈ సదస్సులో నందిని సిధారెడ్డి, అల్లం నారాయణ, ఆచార్య మధు జ్యోతి, జిలకర శ్రీనివాస్‌తోపాటు రెండు రాష్ట్రాల ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కవి సమ్మేళనం, గేయాలు, ఉపన్యాసాలుంటాయని, సాహితీవేత్తలు, అంబేడ్కర్ వాదులు, సామాజికవేత్తలు, విలేకరులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంలో ఎన్నో నూతన ఆవిష్కరణలు వస్తున్నందున వ్యవస్థాపక మనస్తత్వాన్ని పెంపొందించుకోవటం ద్వారా మేధస్సుకు కొత్త భావజాలాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మారుతున్న పరిస్థితులను ఆకలింపు చేసుకోవాలన్నారు. యూత్ ఫర్ ఇంపాక్ట్ కన్వీనర్ సువర్ణదేవి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వినూత్నంగా ఆలోచించేవారు తప్పక విజయం సాధిస్తారని, కొత్తఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు.. సమావేశంలో డాక్టర్ స్రవంతి, హరిప్రసాద్ తిరుపతి, బాల్‌లక్ష్మి, వీణ, నాగ రాణి, సంతోష్, ఉమారాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- గ్రామీణాభివృద్ధిశాఖ, ట్రాన్స్ కో, రెడ్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు
- స్థలాలు సేకరిస్తున్న రెవెన్యూ, ఐకేపీ అధికారులు
- విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అందుబాటులో స్థలాల ఎంపిక

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పొదుపు సంఘాల చేత సోలార్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధిశాఖ, సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రెడ్కో, రెవెన్యూ, ఐకేపీ అధికారులు ఆ దిశగా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా మహిళా సంఘాల చేత ఒకటి లేదా రెండు మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను స్థాపించనున్నారు. ఇప్పటికే సిద్దిపేటరూరల్ మండలం బుస్సాపూర్, నారాయణరావుపేట మండలం కేంద్రంతో పాటు మండలంలోని జక్కాపూర్ రెవెన్యూ పరిధిలో రెండేసి చోట్ల ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులు నివేదిక పంపించారు. ఒక మెగా వాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కనీసం నాలుగెకరాల స్థలం అవసరం ఉంటుంది. పొదుపు బాటలో ఆదర్శనీయంగా నిలిచే మహిళలు సాంప్రదాయేతర ఇంధనవనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించనున్నారు.

ప్లాంట్ ఖర్చు రూ.10 కోట్లు

మహిళా సంఘాల వాటా 10 శాతం

అలాగే ఇళ్లలో ఏర్పాటు దిశగా ప్రత్యేక రుణాలను ఇవ్వనున్నారు. స్త్రీ నిధి నేతృత్వంలో టీఎస్ రెడ్ కో సంస్థ ద్వారా సోలార్ విద్యుత్ వ్యవస్థ యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాల్లో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిద్దిపేటరూరల్‌లో గ్రామైఖ్య సంఘాలు-26, స్వయం సహాయక సంఘాలు -660 ఇందులో 7,423 మంది సభ్యులుగా ఉన్నారు. నారాయణరావుపేట మండలంలో గ్రామైఖ్య సంఘాలు-19, స్వయం సహాయక సంఘాలు-459 ఇందులో 5,024 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే మహిళలకు వివిధరకాల రుణాలను అందించి పాడిపరిశ్రమ, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలకు ప్రోత్సాహకం అందించారు. ఇప్పుడు అదే తరహాలో సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి అందులో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను సబ్ స్టేషన్‌కు సరఫరా చేయనున్నారు. దీంతో వచ్చి ఆదాయంతో మహిళలకు ఆర్థిక చేయూతతో పాటు వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

ఒక మెగావాట్ ప్లాంట్‌కు నాలుగెకరాలు

ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి పాంట్‌ను ఏర్పాటు చేసేందుకు నాలుగెకరాల స్థలం అవసరం ఉంటుంది. ఒక మెగావాట్ ప్లాంట్‌లో పనులు చేపట్టేందుకు సుమారు రూ.3కోట్లు ఖర్చు అవుతుంది. ఇందులో 10 శాతం వాటాను మహిళ గ్రామైఖ్య సంఘం లేదా మండల మహిల సంఘాల సభ్యులు చెల్లించాల్సి ఉంటుంది.

మిగతా 8వ పేజీలో..



సిద్దిపేటలో మోదీ, నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడ్జెట్‌లో తెలంగాణకిచ్చింది గుండుసున్నా

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన
- మోదీ, నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎప్పటిలాగే తెలంగాణకు కేటాయింపులు గుండు సున్నా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తూఇమామ్‌ల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారని, కనీసం రాష్ట్రానికి ప్రాజెక్టులు, రోడ్లు తీసుకురావడంలో విఫలం చెందారని మండిపడ్డారు. నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు పెద్దపీట వేశారని, తెలంగాణకు మాత్రం వివక్ష చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు గంప మహేందర్‌రావు, ఆంక్షారెడ్డి, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, సతీశ్‌గౌడ్, బొమ్మల యాదగిరి, గయాజుద్దీన్, కలీమొద్దిన్, అలకుంట మహేందర్, గ్యాదరి మధు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ మొదలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 62 సెంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం జరిగిన మొదటి సెషన్‌లో జనరల్ విద్యార్థులు (ఎంపీసీ, బైపీసీ) 905 మందికి గానూ 873 మంది (96 శాతం) హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1300 మంది విద్యార్థులకు 1120 మంది (86 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం సెకండ్‌సెషన్‌లో 523 మంది జనరల్ విద్యార్థులకు 512 మంది (98 శాతం) హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1212 మంది విద్యార్థులకు 1115మంది (92 శాతం) మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని ఆ శాఖ అధికారులు ప్రకటించినా ఆచరణలో ఆ పరిస్థితులు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

నిజాంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తగు సలహాలు సూచనలు చేశారు.



నో హెల్మెట్.. నో ఎంట్రీ

సిద్దిపేట ఆర్టీవో కార్యాలయంలోకి హెల్మెట్ లేకుండా వాహనాదారులను అనుమతించటం లేదు. తమ స్వీయ భద్రత విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్(ఆంధ్రజ్యోతి)

సెట్విన్ కోర్సులు.. ఉపాధికి అడుగులు

జహీరాబాద్‌లో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెట్విన్ కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్

జహీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువతకు నైపుణ్యం కల్పించి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించేందుకు విభిన్న శ్రేణి కోర్సులను అందించేందుకు వీలుగా సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్‌సిటీస్) శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జహీబాద్ పట్టణంలో కొన్ని ప్రైవేటు సంస్థలు వివిధ రకాల శిక్షణ కోర్సులను ఏర్పాటు చేసి శిక్షణను ఇస్తున్నప్పటికి ఆర్థిక స్తోమత లేనివారు అందుకు విముఖతను చూపుతున్నారు. గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి జంట నగరాలకే పరిమితమైన సెట్విన్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో, ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో యువత పడుతున్న ఇబ్బందిని గమనించిన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ చూపి శిక్షణ కేంద్రాన్ని జహీరాబాద్‌లో ఏర్పాటు చేయించారు.

రూ.20 లక్షలతో సెట్విన్ కేంద్రం

వికారాబాద్, తాండూర్, జహీరాబాద్ సంగారెడ్డి, జడ్చర్ల తదితర ప్రాంతాల్లో సెట్విన్ సేవలను విస్తరించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. జహీరాబాద్‌లో కోర్సులను ప్రారంభించేందుకు అంతా సిద్ధం చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద రూ.20 లక్షల వ్యయంతో సెట్విన్ కేంద్రం నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శిక్షణ కేంద్రంలో సామగ్రిని సమకూర్చి శిక్షకులను నియమించారు. రూ.5లక్షల విలువైన కంప్యూటర్ సామగ్రి, రూ.3లక్షలతో సీసీటీవి, ఇతర సాంకేతిక సామాగ్రి, రూ.4 లక్షలతో కుట్టుమిషన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 25-30 మందిని చేర్చుకోనున్నారు. రోజుకు రెండేసీ బ్యాచ్‌లకు శిక్షణను ఇవ్వనున్నట్లు ట్రైనర్స్ తెలిపారు.

పది రకాల కోర్సులు

సెట్విన్ కేంద్రంలో 10 రకాల కోర్సులను అందుబాటులో ఉంచారు. 7, 10వ తరగతి పాసైన వారు ఇందులో చేరడానికి అర్హులుగా ప్రకటించారు. ఈ కోర్సులకు నామమాత్రపు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. డిప్లమో ఫ్యాషన్ డిజైన్ కోర్సును మూడు నెలుఉ, ఆరు సెమిస్టర్‌లుగా విభజించారు. మొదటి, చివరి సెమిస్టర్‌లకు రెండు వేల చొప్పున, మిగతా నాలుగు సెమిస్టర్‌లకు రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే డిప్లమో బ్యూటీషియన్ కోర్సును మూడేసి నెలల చొప్పున నాలుగు సెమిస్టర్‌లుగా విభజించారు. మొదటి సెమిస్టర్‌కు రూ.2వేలు, మిగతా మూడు సెమిస్టర్‌లకు రూ.3వేల ఫీజు తీసుకుంటారు. సీసీ టీవీ కోర్సును మూడునెలల పాటు నిర్వహించనున్నారు. రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ, రిఫ్రిజిరేటర్ మరమ్మతులకు సంబంధించి ఆరు నెలల కోర్సుకు రూ.2,500 చెల్లించాల్సి ఉంది. మొబైల్‌ఫోన్ మరమ్మతు కోర్సు 3 నెలల శిక్షణకు రూ.3 వేలు ఫీజు తీసుకుంటారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, స్పోకెన్ ఇంగ్లీష్ మూడు నెలల కోర్సుకు.. ఒక్కో కోర్సుకు రూ.1500 చొప్పున ఫీజు నిర్ణయించారు. పీపీటీటీసీ(ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ కోర్సు)ను 6 నెలల పాటు నిర్వహించనుండగా రూ.3500 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అడ్మిషన్లతో పాటు తరగతుల నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని నిర్వాహకులు వివరించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జహీరాబాద్ ప్రాంతం మున్ముందు పారిశ్రామికంగ అభివృద్ధిచెందుతున్న నేపథ్యంలో సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులు నిరుద్యోగయువతకు ఎంతగానో దోహదపడుతయి. ఉన్నతస్థాయి అధికారులను,నాయకులను ఒప్పించి, మెప్పించి కర్ణాటక సరిహద్దులో ఉన్న జహీరాబాద్ పట్టణానికి తీసుకురావడమైందన్నారు.ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. మున్ముందు మరిన్ని కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి తనవంతు బాధ్యతగ కృషిచేస్తామన్నారు. జంటనగరాలకే పరిమితమైన సెట్విన్‌ను వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగ వివిధ జిల్లాలకు విస్తరించడమైందన్నారు.

- గిరిధర్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్



దౌల్తాబాద్ పీహెచ్‌సీ సమీపంలో చెట్లు, పొదలతో బావి

ప్రమాదకరంగా పాడుబడిన బావి

హత్నూర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పాడుబడ్డ బావి ప్రమాదకరంగా మారింది. స్థానిక అవసరాల నిమిత్తం దశాబ్దాల క్రితం ఈ బావిని తవ్వారు. కాలక్రమంలో భూగర్భ జలాలు అడుగంటి, నీరు రాక బావి నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరింది. పాడుబడ్డ బావిని ఆనుకొని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి కమ్మేయడంతో, అక్కడ బావి ఉన్నట్టు కనిపించడం లేదు. పరిసర గ్రామాల నుంచి నిత్యం పీహెచ్‌సీకి వచ్చే రోగులు, ఆ బావిని ఏ మాత్రం చూడకున్నా ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం అందించి ఆదుకోండి

అదనపు కలెక్టర్‌కు మామిడ్యాల భూనిర్వాసితుల వినతి

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ప్యాకేజీలు అందించి ఆదుకోవాలని సోమవారం ములుగు మండలం మామిడ్యాలకు చెందిన కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌కు వినతిపత్రం అందించారు. తాము భూములు కోల్పోయి ఆరేడు సంవత్సరాలు అవుతున్నా రావాల్సిన ప్యాకేజీలు రాలేదని అధికారులతో మొరపెట్టుకున్నారు. నిజమైన నిరుపేదలకు ప్యాకేజీ ఇళ్లు అందించకుండా అనర్హులకే ఇచ్చారన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ మాట్లాడుతూ కలెక్టర్ దృషికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



అదనపు కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రం

13వ అంతస్తు నుంచి పడి సూపర్‌వైజర్ మృతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు 13వ అంతస్తు పైనుంచి కింద పడిన సూపర్‌వైజర్ మృతిచెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధి ఉస్మాన్‌నగర్‌లో చోటుచేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బండి మునికుమార్‌రెడ్డి(36) అస్త గ్రీన్ హోమ్స్ నిర్మాణ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి తెల్లాపూర్ ఇంద్రానగర్‌లో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం విధులకు వెళ్లాడు. 13వ అంతస్తులో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు పైకి వెళ్లాడు. ఇదే చివరి అంతస్తు కాగా, అక్కడ భవనం పేరు కోసం ఏర్పాటు చేస్తున్న కాలంను పట్టుకుని నిలుచున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవ శాత్తు కిందపడ్డాడు. వెంటనే సంస్థ యజమాని ఆదేశాలతో దగ్గరలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మునికుమార్ మృతిచెందాడు. మునికుమార్ భార్య ఫిర్యాదు మేరకు సీఐ రవీందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై వెళ్తూ అడవి పందిని ఢీకొట్టి..
ఎమ్మెల్యే గన్‌మన్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

పటాన్‌చెరు, రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తూ రోడ్డుకి అడ్డంగా వచ్చిన అడవిపందిని ఢీకొట్టి ఏఆర్ కానిస్టేబుల్, చేవెళ్ల ఎమ్మెల్యే గన్‌మన్ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి సంగారెడ్డి జిల్లా వెలిమెల తండా శివారులో చోటుచేసుకున్నది. బీడీఎల్ పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం బల్కాపూర్ గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తంగి శ్రీనివాస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వద్ద గన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ ఆదివారం రాత్రి కొండకల్ గ్రామం నుంచి వెలిమెల వైపు బైక్‌పై వెళ్తుండగా వెలిమెల తండా సమీపంలో రోడ్డుకి అడ్డంగా వచ్చిన అడవిపందిని ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న బీడీఎల్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ వద్ద ఒకరికి గాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అడవి పంది ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. రామాయంపేటకు చెందిన మద్దూరి మహేష్ తన ద్విచక్ర వాహనంపై నిజాంపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో మండల పరిధిలోని నందిగామ శివారు బాట పోచమ్మ ఆలయం వద్ద అడవి పంది వాహనానికి తగలడంతో కిందపడి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

బోర్‌వెల్స్ వాహనం, కారు ఢీ
నలుగురికి తీవ్రగాయాలు

కొండపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బోరు వేసే వాహనం కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన కొండపాక మండలం వెలికట్ట శివారులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగాల వెంకటరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి చేర్యాల మండలం తాడూరుకు శుభకార్యానికి కారులో బయలుదేరారు. వెలికట్ట క్రాస్ రోడ్డు దాటి తాడూరు వైపు వెళ్తున్న క్రమంలో చేర్యాల వైపు నుంచి అంకిరెడ్డిపల్లి వైపునకు వెళ్లేందుకు బోర్‌వెల్స్ వాహనం మలుపు తీసుకుంటున్న క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దాంతో కారులో ప్రయాణం చేస్తున్న వెంకట్‌రెడ్డి, ఆయన భార్య పద్మ, బావమరిది తదిపత్రిరెడ్డి, అత్త రాజవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుని గాయాలకు గురైన వారిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను బ్లూకోల్ట్ పోలీసులు స్థానికుల సహాయంతో పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

నెలరోజుల వ్యవధిలో భార్యాభర్త మృతి

- భర్త మృతి తట్టుకోలేక భార్యకు పక్షవాతం
- ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా గుండెపోటు


శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి(ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి చెందిన భార్యాభర్తలు నెలరోజుల వ్యవధిలో మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఆయన భార్య జ్యోతికి డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న కుమారుడు దయాకర్ గౌడ్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుమార్తె మానస ఉన్నారు. జనవరి 11న శ్రీనివాస్‌గౌడ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతిని తట్టుకోలేక భార్య జ్యోతి అనారోగ్యానికి గురైంది. పక్షవాతం రావడంతో కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. నెల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

మిరుదొడ్డి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యపై కమ్మకత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి మధిర గ్రామమైన మాధన్నపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధన్నపేట వడ్డెరకాలనీకి చెందిన సంతోషకు, చేర్యాల మండలం భాణంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. సంతోష కొన్నాళ్లుగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటుంది. సోమవారం భాస్కర్ తన బైక్‌లో కమ్మకత్తిని పెట్టుకుని వడ్డెరకాలనీలోని అత్తవారింటికి వచ్చారు. సంతోష కుటుంబసభ్యులు భాస్కర్‌తో మాట్లాడుతుండగానే అక్కడే ఉన్న సంతోషపై ఒక్కసారిగా కత్తితో దాడి చేయగా చేతికి గాయమైంది. భాస్కర్ అక్కడి నుంచి పారిపోతుండగా స్థానికులు పట్టుకున్నారు. 108 అంబులెన్స్ సమాచారం అందించగా, అక్కడిచేరుకుని సంతోషను సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్


నిందితులను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం స్థానిక ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నీరుడిచెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారని ఎక్సైజ్ పోలీసులు సమాచారం అందింది. చెరువు వద్దకు వెళ్లి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని తనిఖీలు చేయగా వారి స్కూటీలో 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని ముదిరాజ్ బస్తీకి చెందిన నీరుడి సాయికుమార్(25), ఇస్నాపూర్‌కు చెందిన రేణుదేవి(34)ని అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ పరమేష్‌గౌడ్ తెలిపారు.

బంగారం, వెండితో ఉడాయించిన
ముగ్గురు నగల తయారీదారుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో బాధితులను మోసం చేసిన కేసులో ముగ్గురు ఆభరణాల తయారీదారులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఖాజీపేటలకు చెందిన వెలువలి శేఖ్ చందానిభాష, అతని కుమారులు మహబూబ్ భాష, అఫ్రీద్‌భాష జహీరాబాద్ పట్టణంలోని నాగులకట్ట వద్ద ఎస్ఎండీ జ్యులైరీ పేరుతో 40 సంవత్సరాలు దుకాణాన్ని నిర్వహించారు. వారు బంగారం, వెండి ఆభరణాలను ఆర్డర్‌పై తయారుచేస్తుంటారు. రెండేళ్ల క్రితం దుకాణాన్ని ఎత్తేశారు. నగల తయారీ కోసం 45 మంది నుంచి సుమారు రూ.80 లక్షలు విలువ చేసే బంగారం, వెండిని తీసుకుని ఉడాయించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. వారంతా కుటుంబ సమేతంగా వరంగల్‌లో నివాసం ఉన్నట్లు పోలీసులకు తెలిసింది. సోమవారం వారిని వరంగల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.


ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పెంచుతున్న మామిడి అంటు మొక్కలు

ఉద్యాన రైతుకు ఊతం..
సీఈవో కేంద్రం

- ములుగులో ఉద్యాన పంటలపై పరిశోధనలు
- మేలైన రకాల పెంపకం
- కేంద్రం ద్వారా రైతులకు నారు, మొక్కల సరఫరా

ములుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగులో రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో ఎన్నో రకాలుగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి రక్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సిద్దిపేట జిల్లా ములుగులో ఉద్యానశాఖ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఈవో) కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. ఉద్యాన పంటల సాగులో మెలుకువలు నేర్పుతూ, నాణ్యమైన మొక్కలు అందిస్తూ రైతులు లాభాలు ఆర్జించేందుకు కృషి చేస్తున్నది. కేంద్రం ద్వారా రైతులకు మేలైన ఉద్యాన పంటల రకాలను అందజేసేందుకు నిర్ణయించారు. రైతుల డిమాండ్ మేరకు పండ్ల మొక్కలు, కూరగాయల నారు నర్సరీలలో పెంచి రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలోని రైతులకు డిమాండ్ మేరకు అందజేస్తున్నారు.

నారు, పండ్ల మొక్కల పెంపకం

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రంలో కూరగాయలలో టమాట, పచ్చిమిర్చి, వంకాయ, క్యాబేజీ, క్యాలిఫ్లవర్, గ్రీన్ కాలిఫ్లవర్ వంటి నాణ్యమైన రకాలు ఎంపిక చేసి నారు పెంపకం చేస్తున్నారు. రైతుల డిమాండ్ మేరకు పెంచి నారును అందజేస్తున్నారు. పండ్ల మొక్కలలో మామిడి, జామ, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి మొక్కలను అంటు పద్ధతి, విత్తనంతో ఉత్పత్తి చేసి అందజేస్తున్నారు. వీటితోపాటు డిమాండ్ ఉన్న శ్రీగంధం, వెదురు మొక్కలను నర్సరీలో పెంచుతూ రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

మామిడి తోటలకు దన్నుగా

ప్రస్తుతం ప్రధానంగా డిమాండ్ ఉన్న మామిడి తోటల పెంపకంలో రైతులకు దన్నుగా నిలుస్తున్నారు. ప్రయత్నాలు చేస్తున్నారు. మామిడిలో 20 రకాలు ఉండగా, ప్రధానంగా డిమాండ్ ఉన్న ఆరు రకాలు బేనిశా, దసెరి, హిమాయత్, కేసరి, రాయల్ స్పెషల్, రత్న రకాలను అంటు పద్ధతిలో పెంచి రైతులను అందజేస్తున్నారు. జామలో డిమాండ్ కలిగిన అలహాబాద్ సఫెద, లక్నో 49 రకాలైన మొక్కలు పెంపకం చేసి రైతులను ప్రోత్సహిస్తున్నారు.

30 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం

సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ కేంద్రంలో 2024-25లో 30 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో మామిడి 40 వేలు, జామ 10 వేలు, నిమ్మ 6 వేలు, బొప్పాయి 6 వేలు, శ్రీగంధం 50 వేలు, వెదురు 45 వేలు, అలంకార పూల మొక్కలు 6 వేలు, ఇతర కూరగాయలు లక్ష్యంగా మొక్కల పెంపకం చేస్తున్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, సిద్దిపేట, మెదక్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్లా, వరంగల్, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఉద్యాన అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకువస్తే ఉచితంగా మొక్కలను అందజేస్తున్నారు.


కూరగాయల నారును పరిశీలిస్తున్న కేంద్రం శాస్త్రవేత్తలు



ములుగులోని ఉద్యాన శాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం

రైతుల డిమాండ్ మేరకు ప్రణాళిక



రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు పలు రకాల మొక్కలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించి పెంచుతుంటాం. ఆయా జిల్లాల ఉద్యానశాఖ అధికారుల నిర్ణయం మేరకు మొక్కలు, నారు పెంపకం చేస్తున్నాం. మేలైన మొక్కలు పొందేందుకు రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. - శ్రీధర్, ఏడీహెచ్ (సీఈఓ)

బాణాపూర్‌లో
ఇరువర్గాల ఘర్షణ

- కావాలనే స్తంభాన్ని తాకించావంటూ ప్రారంభమైన గొడవ
- పొట్లాడుకున్న బుడగ జంగాలకాలనీవారు, పలువురు గ్రామస్థులు
- పది మందికి గాయాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. రెండు గ్రూపులు పరస్పరం దాడులు చేసుకోగా పది మంది గాయపడ్డారు. ఈ సంఘటన నారాయణఖేడ్ మండలం బాణాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలంలోని బాణాపూర్ గ్రామం పక్కనే బుడగజంగాల కాలనీ ఉంది. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ వెనుకకు తీస్తుండగా బుడగ జంగాల కాలనీ సమీపంలోని ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో కాలనీతో పాటు, గ్రామంలోని కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామం పక్కనే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని శనివారం ట్రాక్టర్‌కు కట్టి తీసుకువస్తుండగా బుడగ జంగాల కాలనీకి చెందిన ఓ వ్యక్తి కాలికి స్తంభం తాకింది. దాంతో అప్పుడు చిన్నగా వాదులాడుకుని వెళ్లిపోయారు. స్తంభం కాలికి తగిలిన బుడగ జంగాల కాలనీకి చెందిన వ్యక్తి సోమవారం గ్రామ సమీపంలో యువకులు క్రికెట్ ఆడుతున్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఉండగా అతడి వద్దకు వెళ్లి కావాలని తగిలించావంటూ వాగ్వాదానికి దిగాడు. మాటమాట పెరిగి వారిద్దరి మధ్య తగాదా పెద్దగా మారిపోయి బుడగ జంగాల కాలనీ వారు, గ్రామానికి చెందిన వారు అక్కడకు చేరుకుని ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకుని కొట్టుకున్నారు. బుడగ జంగాల కాలనీకి చెందిన శ్రీను, శేఖర్, మరో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బీరప్ప, వంశీ, కృష్ణ, దుర్గయ్యతోపాటు మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలియగానే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకితెచ్చారు. గాయపడిన వారిని నారాణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

పసి హృదయాలకు 'సంజీవని'

- సత్యసాయి సేవా సంస్థల సేవలు అద్భుతం
- ప్రముఖ సినీనటుడు సుమన్


ఆపరేషన్ అయిన చిన్నారితో మాట్లాడుతున్న నటుడు సుమన్

కొండపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలు మహోన్నతమైనవని, ఈ స్ఫూర్తితో సేవాతత్పరతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ ఉన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక ఆనంద నిలయం శివారులోని సత్యసాయి సంజీవని హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్‌ను సినీ నటుడు సుమన్ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో ఆపరేషన్ల తీరును పరిశీలించారు. చిన్నారులను పలకరించారు. అనంతరం ఆపరేషన్లు చేసుకున్న నలుగురు చిన్నారులకు మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపాక శివారులో ఏర్పాటైన ఆసుపత్రి చిన్న పిల్లల జీవితాలకు సంజీవనిగా నిలిచిందని, ఇది దినదినాభివృద్ధి చెంది ప్రపంచస్థాయిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎంతో మంది పేదలు వారి పిల్లల గుండె జబ్బులకు వైద్యం చేయించలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారందరికీ ఈ ఆసుపత్రి అండగా నిలిచి ఉచిత చికిత్సలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఎంతో కష్టతరమైనదని సర్జరీలను విజయవంతంగా నిర్వర్తిస్తున్న వైద్యులను ఆయన అభినందించారు. దేశంలో సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలోని ఆసుపత్రుల్లో సుమారు 34 వేల గుండె ఆపరేషన్ చేయడం గొప్ప విషయం అన్నారు.

విద్య వైద్యం ఆరోగ్య రంగాలపై సేవలు

విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి మాట్లాడుతూ సత్యసాయి సేవలు దేశ విదేశాల్లో అందిస్తున్నాయని విద్యా, వైద్యం, నీరు, ఆరోగ్యం లాంటివి ప్రజలకు అందిస్తూ ముందుకు సాగుతున్నదన్నారు. ఇలాంటి సేవలు నిరంతరం కొనసాగాలన్నారు. 24 సంవత్సరాల క్రితం తాను అధికారిగా ఉన్నప్పుడు కేవీ కెనాల్ కోసం సత్యసాయి బాబాను కోరగా రూ.175 కోట్లు కెనాల్ నిర్మాణం కోసం సహకారామదించారని గుర్తుచేశారు. ఆసుపత్రి అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. దేశంలో ఉన్న అన్ని సబ్‌సెంటర్లతో అనుసంధానమై పేదలకు విస్తృత సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాబా సంకల్పంతో ఆసుపత్రి ఏర్పాటు చేసి పసి హృదయాలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. సుమారు 7500 సర్జరీలు చేసిన డాక్టర్ రాగిణి మాట్లాడుతూ సత్యసాయి కృప ఆశీస్సులతో సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చికిత్స పొందిన పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఆస్పత్రిని దేవాలయంగా, డాక్టర్లను దేవుళ్లగా సంబోధిస్తూ కొనియాడారు. ఎన్నో కష్టాలు పడి ఈ ఆస్పత్రికి వచ్చామని ఇక్కడ అన్ని విధాలుగా అన్ని సౌకర్యాలతో సేవలు అందాయని కృతజ్ఞతలు కార్యక్రమంలో దుర్గ వడ్లమూడి మాట్లాడగా డాక్టర్ స్వప్న, జగన్నాథ శర్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో శిక్షణ పొందిన సిబ్బందికి మెమోంటోలను అందజేశారు. కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమాపార్వతి ఆలయంలో సినీ నటుడు సుమన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఘటం ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన

కొండపోచమ్మతల్లికి
నీరాజనం


బోనం తీసుకెళ్తున్న మహిళ

యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘటం ధూంధాం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మకు భక్తులు పోటెత్తారు. మూడోవారం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సోమవారం అమ్మసన్నిధికి చేరుకోవడంతో భక్తజనసందోహంగా మారింది. అమ్మవారి దర్శనానికి లైన్‌లలో గంటల తరబడి పిల్ల పాపలతో కలిసి వేచి ఉన్నారు. శివసత్తుల సిగాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పులచప్పులతో అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా అమ్మవారి జాతరను పురస్కరించుకొని హైదరాబాద్‌కు చెందిన యాదవ సంఘం నాయకుడు బోయిని సాయియాదవ్ ఆధ్వర్యంలో బోనం, ఘటం ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. ఆర్కేస్ట్రా బృందం ఆధ్వర్యంలో ఘనంగా ధూంధాం కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జ రమేష్, హైదరాబాద్ యాదవ సంఘం నాయకులు బొంతు శ్రీదేవి, నవీన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణయాదవ్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.





పర్యావరణహిత పరిణయం

వివాహ వేదికలోకి రాగానే పూలు, పన్నీరుతో స్వాగతం, తామరాకు తొట్టిలో ఫలహారం, మట్టితో చేసిన గ్లాసులో చల్లని పానీయం, వేదికంతా ప్రకృతితో మమేకమయ్యేలా అలంకరణ, నోరూరించే 21 రకాల వంటకాలతో అరిటాకుల్లో భోజనం, మర్యాదగా కూర్చొపెట్టి... కొసరి కొసరి వడ్డించడం, ఆహా ఆ వేడుక చూడటానికి రెండు కళ్లు సరిపోవు కదా. ఇదంతా ఒకటైతే వేడుక అంతా పర్యావరణహితమే. ఇలాంటి కార్యక్రమానికి సంఘం పద్మ మధుసూదన్‌రెడ్డి చిన్నకుమారుడి వివాహం వేదికైంది. సోమవారం సిద్దిపేటలో పోలీస్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగింది. ఈ స్ఫూర్తితో అందరూ జీరో వేస్ట్ కార్యక్రమాలను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్ కోరారు. అందుకు తమ సహకారం ఉంటుందని తెలిపారు.

- సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)

సాంద్రానందాశ్రమంలో ఘనంగా పాదపూజ

చేర్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని సాంద్రానందాశ్రమంలో పాద పూజ మహోత్సవ వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. విశేష ఫల, పుష్ప అభిషేకం జరిపారు. అలాగే మందిరంలోని హయగ్రీవ, రాజరాజేశ్వరి, దత్తాత్రేయ, దక్షిణామూర్తికి పూజలు జరిపారు. అదేవిధంగా మండలంలోని నారసింహీ గురుస్థానం భువనేశ్వరీ మందిరంలో నిర్వహిస్తున్న శైశిరమాఘ నవ రాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధరకాల పూలతో అలకంరణ చేసి అభిషేకించారు. లలితాపంచమి, డోలోత్సవం, కైలాస గౌరీవ్రతం నిర్వహించారు.

ఎంపీడీవో కార్యాలయం ప్రారంభం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ప్రారంభమైంది. కొండపాక మండల ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాంప్రసాద్ సోమవారం కుకునూరుపల్లి ఎంపీడీవో ఇన్‌చార్జిగా బాధ్యతలను స్వీకరించారు. మండలం ఏర్పాటైన రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దౌల్తాబాద్: దొమ్మాట, గాజులపల్లి దక్షిణకాశీ కైలాసేశ్వర ఆలయంలో విద్యార్థులచే అభిషేకం చేయిస్తున్న శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ



సరస్వతి మాత వేషధారణలో ఓ చిన్నారి



కొండపాక: అష్టాదశ శక్తి పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు

జిల్లాలో ఘనంగా వసంతపంచమి

న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సోమవారం వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు, విద్యాసంస్థల్లో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. శ్రీసరస్వతి అమ్మవారి జన్మదినం సందర్భంగా నిర్వహించే ఈ వేడుకల నేపథ్యంలో ఆలయాలు భక్తజనంతో, అక్షర స్వీకారాలతో కిటకిటలాడాయి. సిద్దిపేట పట్టణంలోని ఆలయాలతో పాటు పలు విద్యాసంస్థల్లో వసంతపంచమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్, సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలోని శ్రీవిద్యారణ్య అవాస విద్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో గల సరస్వతీ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో శ్రీ సరస్వతీ జన్మోత్సవం, ప్రత్యేక పూజలు, రథోత్సవం, ధార్మిక ప్రవచనం, కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరస్వతీ క్షేత్రంలో చిన్నారులకు అక్షర స్వీకారాలు కొనసాగాయి. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట, గాజులపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న దక్షిణ కాశీ కైలాసేశ్వర ఆలయంలో చాముండేశ్వరీ గురు దత్త పీఠం బాధ్యుడు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకం, చేశారు. అనంతరం చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. కొండపాక లోని అష్టాదశ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో అమ్మవారు నీల సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని శ్రీవెంకటేశ్వరాలయంలో మేధాసూక్త చండీహోమం, చిన్నారులతో అక్షరాభ్యాసం నిర్వహించారు.





చిన్నకోడూరు: అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో కొలువైన అమ్మవారు, చిన్నారులకు అక్షర స్వీకారాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి తీవ్ర గాయాలు



కొండపాక: వెలికట్ట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

కొండపాక/గజ్వేల్ రూరల్/మద్దూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో బోరువాహనం, కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి, దూళిమిట్ట మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒక్కొక్కరు చొప్పున గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మిరుదొడ్డి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగాల వెంకటరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి చేర్యాల మండలం తాడూరుకు శుభకార్యానికి సోమవారం కారులో బయలుదేరారు. వారు వెలికట్ట క్రాస్ రోడ్డు దాటి తాడూరు వైపు వెళ్తున్న సమయంలో చేర్యాల వైపు నుంచి అంకిరెడ్డిపల్లి వైపునకు వెళ్లేందుకు మలుపు తీసుకుంటున్న బోరువాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వెంకటరెడ్డి, ఆయన భార్య పద్మ, బావమరిది తదిపత్రి రెడ్డి, అత్త రాజవ్వలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట గ్రామ సమీపంలో కారు చెట్టును ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన నాయిని స్వామి సోమవారం కారులో గజ్వేల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. లింగరాజ్‌పేట సమీపంలో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో స్వామికి గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 వాహన సిబ్బంది క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు బంధువులు తెలిపారు. బెజ్కల్ గ్రామానికి చెందిన గుండె కరుణాకర్ ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తున్న క్రమంలో దూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామశివారులో ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో నంగునూరు పీహెచ్‌సీకి తరలించారు.

'జాతీయ నులి పురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాలులో జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆల్బెండజోల్ మాత్రలను 1-2 సంవత్సరాల పిల్లలకు 1/2టాబ్లెట్, 2-3 మూడు సంవత్సరాల పిల్లలకు 1 టాబ్లెట్ పొడిచేసి అందించాలని, 3-19 సంవత్సరాల పిల్లలకి ఒక టాబ్లెట్ చప్పరించేలా ఇవ్వాలని వైద్యాధికారులు వివరించారు. విద్యాశాఖ అధికారులు మండలస్థాయిలో ఎంఈవో, హెచ్‌ఎంలకు ఈ సమావేశం గుర్చి తెలియజేసి ప్రతీ ఒక్క విద్యార్థికి మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లను ఇందులో భాగస్వామ్యం చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సైతం మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ట్రస్మా యాజమాన్యాలకు సూచించారు. జూనియర్ కళాశాలలో సైతం ఈ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియేట్ శాఖ అధికారులకు తెలిపారు. పిల్లలకు చేతుల పరిశుభ్రతపైన, వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కల్పిస్తే వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీ కాంత్‌రెడ్డి, మెప్మా పీడీ హన్మంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణం స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి



3వ వార్డులో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పిలుపునిచ్చారు. మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సోమవారం చెత్త సేకరణను పరిశీలించిన ఆయన తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వచ్చే మునిసిపల్ వాహనానికి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, పట్టణం శుభ్రంగా ఉంటేనే మనం అందరం ఆరోగ్యంగా ఉంటామని తెలియజేశారు. వెంట మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల దాహార్తి తీర్చిన ఉపాధ్యాయుడు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలలో తాగునీటికి పడుతున్న ఇబ్బందులు గుర్తించిన ఉపాధ్యాయుడు బోర్ వేయించి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్‌లోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చాలాకాలంగా తాగునీటికి ఇబ్బంది పడుతుండటాన్ని చూసి చలించిపోయిన పీఈటీ పాలమాకుల ప్రవీణ్ తన సొంత ఖర్చులతో బోర్ వేయించడంతో పాటు మోటార్ బిగించి వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సమస్యను పరిష్కరించిన ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

'కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాలకు అన్యాయం'

సిద్దిపేట రూరల్/నంగునూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేసిందని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు విమర్శించారు. సోమవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్, గోపులాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా రాజానర్సు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టేందుకు రైతులు, మహిళలు,యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నంగునూరు మండలం అక్కెనపల్లి, గట్ల మల్యాల, సంతోష్ నగర్ గ్రామాల్లో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్‌తో కలిసి బీఆర్ఎస్‌పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రతీ కార్యకర్త ఒక సైనికునిడిలా పని చేయాలని పిలుపునిచ్చారు.

మల్లన్న భక్తులకు పోలీసుల 'కనువిప్పు'



మల్లన్న భక్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎల్. శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మూడవవారం జాతర సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో పోలీసులు ఆదివారం రాత్రి కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులకు సోషల్‌మీడియా వల్ల అనర్థాలు, రోడ్డుభద్రత, గంజాయి సేవనంతో కలిగే నష్టాలు, సైబర్ నేరాలు ఇతరత్రా అంశాలపట్ల అవగాహన కల్పించారు. చేర్యాల సీఐ ఎల్ శ్రీను మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని, గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలకు బానిస కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం పలు ప్రదర్శనలు చేశారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

సిద్దిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక, మిరుదొడ్డి మండలానికి చెందిన విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆల్‌స్టైల్ మార్షల్‌ఆర్ట్స్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో దుబ్బాక, మిరుదొడ్డి విద్యార్థులు సత్తా చాటినట్టు కరాటేమాస్టర్ బూరని శ్రీకాంత్ తెలిపారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. దుబ్బాక పట్టణానికి చెందిన 10 మంది విద్యార్థులకు గోల్డ్, 9సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌కు చెంది హర్షిత గోల్డ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు.

నేటి నుంచి కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్

నంగునూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు లింగంగౌడ్ తెలిపారు. సోమవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మండల ఇన్‌చార్జి గుండు భూపేష్‌లతో కలిసి మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ నుంచి రెండు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నంగునూరు గ్రామశాఖ అధ్యక్షుడు ఉల్లి చిన్న మల్లయ్య ఇంటి వద్ద క్రికెట్ ఎంట్రీ టీమ్‌ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిగా రూ. లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం 8179611796, 9704260576, 9951363765, 9000658945, 9949195924, 9959036509, 9951505255 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

భవన నిర్మాణ కార్మికులకు 55 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి



జగదేవ్‌పూర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న బీఎన్ఆర్‌కేఎస్ కార్మికులు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేసిన కార్మికులందరికీ 55 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్ర బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం అంజయ్యభవన్ ముట్టడికి జగదేవ్‌పూర్ మండలం నుంచి కార్మికులు భారీ వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నర్ర బిక్షపతి మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, అలా చేస్తే కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఆ బోర్డుకు చైర్మన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆశయ, నారాయణరెడ్డి, బాలేశం, సత్యనారాయణరెడ్డి, కనకయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం: మాజీ ఎమ్మెల్యే

గజ్వేల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ గుంటుకు రాములు కుమారుడు గుంటుకు మహేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వెంట డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి రవిందర్‌రెడ్డి, నిమ్మ రంగారెడ్డి, సలీమ్, మల్లేశం, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితకు మల్లన్న ప్రసాదం

చేర్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్సీ కవితకు కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. కరీంనగర్ జిల్లాకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితను గ్రామశివారులోని రాజీవ్‌రహదారి స్వాగతతోరణం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పార్టీ స్థితిగతులు, ప్రభుత్వవైఖరిపై నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

ఎమ్మెల్యే పల్లాపై కాంగ్రెస్‌నేతల వైఖరి సరికాదు

చేర్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి చెప్పులదండ వేసి అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతల వైఖరి సరికాదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అందె బీరయ్య అన్నారు. సోమవారం చేర్యాలలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలంటే విమర్శలుండాలే గానీ అవమానపరిచే పనులు చేపట్టడం సరికాదన్నారు. గౌరవమైన హోదాలో ఉన్న ఎమ్మెల్యే పల్లా పట్ల కాంగ్రెస్ నేతల తీరును ఖండిస్తున్నామన్నారు.

కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా బాలకిష్టయ్య

● 11వ సారి ఎన్నిక



హుస్నాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): హుస్నాబాద్ పట్టణ కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా బెజుగం బాలకిష్టయ్య ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వడ్డెపల్లి నారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలకిష్టయ్య 11వ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కిరాణా వర్తక సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కేన్సర్‌ను మొదట్లో గుర్తిస్తే జయించవచ్చు: స్వాతిరెడ్డి



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ స్వాతిరెడ్డి

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చునని జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ ఎస్. స్వాతిరెడ్డి తెలిపారు. సోమవారం సిద్దపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో లీగల్‌సెల్ అథారిటీ, జిల్లా వైద్యశాఖ సంయుక్తంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్.స్వాతిరెడ్డి మాట్లాడుతూ కేన్సర్ సోకిన వ్యక్తి మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే వ్యాధిని జయించవచ్చన్నారు. ఏ చిన్న నొప్పి అయినా నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మహిళలు తమ ఆరోగ్య పరిస్థితిని గమనించుకోవాలని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు.

పొగాకు ఉత్పత్తులు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గుట్కా, సిగరెట్లు, తంబాకు వాడేవారికి కేన్సర్ వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఎన్.నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో రేవతి, రూరల్ సీఐ శ్రీను, మెడికల్ అధికారి డాక్టర్ బాపురెడ్డి, రూరల్ ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య ప్రపంచం

శత సహస్ర నమస్కార ప్రదర్శన ప్రోమో ఆవిష్కరణ



ప్రోమోను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన ఆరోగ్య విధానాలు, యోగాను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రపంచాన్ని నిర్మించవచ్చునని సిద్దిపేట జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం శత సహస్ర సూర్య నమస్కార ప్రదర్శన, రాష్ట్రస్థాయి పోటీలకు సంబంధించి ప్రోమోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆరోగ్య విధానాలు ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. యోగ సాధనను ప్రజలందరూ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. సిద్ధిపేట వ్యాస మహర్షి యోగ సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల మినీ స్టేడియంలో నిర్వహించే లక్ష సూర్య నమస్కారాల ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని కోరారు. పాల్గొన్న వారికి సర్టిఫికెట్, మెడల్‌ను ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఎన్జీవో భవన్ అధ్యక్షులు అయిత అంజయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ కల్లేపల్లి శ్రీనివాస్, యోగా శిక్షకులు తోట సంధ్య, సురేష్, కవిత, సాయి పాల్గొన్నారు

'లక్ష డప్పులు- వేల గొంతులు' విజయవంతం చేయాలి

నంగునూరు/దూళిమిట్ట/కోహెడ, ఫిబ్రవరి 3: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న చేపట్టిన ఛలో హైదరాబాద్ లక్షల డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ మండల అధ్యక్షులడు దేవులపల్లి బాలరాజు కోరారు. సోమవారం నంగునూరులో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. దూళిమిట్ట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష డప్పులు వెయ్యి గొంతులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దూళిమిట్ట మండల ఇన్‌చార్జి సుందరగిరి భాస్కర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు మండలంలోని ప్రతీ గ్రామం నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కోహెడ మండల కేంద్రంలో ఎస్సీల వర్గీకరణ అమలు జాప్యాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగల గుండెచప్పుడు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలకు అనుకూలం

గజ్వేల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలకు అనుకూలంగా.. పేదలకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌లకు, సంపన్న వర్గాలకు 3శాతం పన్ను రాయితీ తగ్గించారని, ప్రత్యక్ష పన్నులు పెరిగి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. 50లక్షల కోట్ల బడ్జెట్‌లో కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించలేదని, ప్రభుత్వ ఆధీనంలోని ఎల్ఐసీలో 100శాతం ఎఫ్‌డీఐలను అనుమతించడం ప్రైవేటీకరణ చేయడమేనన్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేఖంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళా సంఘాలకు సోలార్‌ప్లాంట్లు

(5వ పేజీ తరువాయి)

మిగితా డబ్బును ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుంది. ఒకసారి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ కనీసం 20 నుంచి 25 ఏళ్ల పాటు ఆదాయం అందనుందని అధికారులు చెబుతున్నారు. సోలార్ ప్లాంట్ కోసం తీసుకున్న రుణాలను కనీసం 15 సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలాలను రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, ట్రాన్స్‌కో అధికారులతో సోలార్ విద్యుత్ టెక్నికల్ అధికారుల సైతం పరిశీలించారు.

సోలార్ పాంట్లతో మహిళా సాధికారత



మహిళా సాధికారతను పెంపొందించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టులు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. మహిళలు ఆర్థికంగా ఎదిగందుకు అనేక పథకాలను ప్రభుత్వాలు అందించాయి. ఇంత పెద్ద మొత్తం పెట్టుబడితో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయం.

- పిడిశెట్టి యాదమ్మ, మహిళా సమాఖ్య కార్యదర్శి

మహిళలకు ఆదాయమార్గం



మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు అందుబాటులో ఉండే విధంగా రెండు గ్రామాల్లో రెవెన్యూ అధికారుల సహకారంతో ఒక్కో ప్లాంట్‌కు నాలుగెకరాల స్థలం ఎంపిక పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులు ప్రారంభమవుతాయి. విద్యుత్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుని ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్‌ను దగ్గరలోని సబ్‌స్టేషన్‌కు సరఫరా చేస్తాం. మహిళలకు ఉపాధితో మండల సమాఖ్య, గ్రామైఖ్య సంఘాల అభివృద్ధికి ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం మహిళలను అంచెలంచెలుగా వ్యాపార రంగంలో ఎదిగేందుకు ఇలాంటి సంక్షమ పథకాలు ఎంతగానో దోహదపడుతాయి.

- చంద్రం, ఏపీఎం ఐకేపీ, నారాయణరావుపేట